సాక్షి చిత్తూరు
మంగళవారం। 12। ఆగస్టు। 2025



మద్యం షాపునకు కన్నం వేసి చోరీ
మద్యం షాపునకు కన్నంవేసి నగదు, మద్యం దోచుకెళ్లిన ఘటన రొంపిచెర్ల మండల కేంద్రంలో చోటు చేసుకుంది. - 8లో



..కానిస్టేబుల్ మృతి
గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో కానిస్టేబుల్ మృతిచెందిన ఘటన కార్వేటినగరంలో చోటుచేసుకుంది. - 8లో



ఆకాశంలో మూడో కన్ను
పోలీసు శాఖ ఏఐ టెక్నాలజీని అందిపుచుకుంటోంది. డ్రోన్ కెమెరాతో నిఘాను కట్టుదిట్టం చేయనుంది. - 8లో


పారిశ్రామిక ప్రగతి.. అధోగతి!


కోసలనగరంలో ఏర్పాటు చేసిన ఏపీఐఐసీ బోర్డు


కోసలనగరంలో ఏపీఐఐసీకి కేటాయించిన భూముల్లో పిచ్చిమొక్కలు

కొత్తకొత్త పరిశ్రమలు.. మౌలిక వసతులతో కళకళలాడాల్సిన భూములు వెలవెలబోతున్నాయి. వేగంగా జరుగుతూ వచ్చిన పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఆగిపోయాయి. తామొస్తే పరిశ్రమలు క్యూకడతాయన్న పాలకుల మాటలు నీటిమీద రాతలుగా మారిపోయాయి. పరిశ్రమలకు కేటాయించిన భూముల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి వెక్కిరిస్తున్నాయి. ఈ పరిస్థితి చిత్తూరు జిల్లా, నగరి నియోజకవర్గంలోని విజయపురం మండలం, తిరుపతి జిల్లాలోని వడమాలపేట మండలాల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

- పరిశ్రమల ఏర్పాటును గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం
- అధికారంలోకి వచ్చిన కొత్తలో హడావుడి
- ఆచరణలో కనిపించని పురోగతి
- అటకెక్కిన కోసలనగరం పారిశ్రామికవాడ పనులు
- పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న భూములు



విజయపురం: పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా 2006లో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రెండు జాతీయ రహదారులు, నౌకాశ్రయం సమీపంగా ఉన్న చిత్తూరు జిల్లా, నగరి నియోజకవర్గం, విజయపురం మండలాన్ని పరిశ్రమల ఏర్పాటుకు అనువైన ప్రాంతంగా తేల్చారు. 2015లో పారిశ్రామిక వాడ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే అప్పటి పాలకులు ఎలాంటి ప్రణాళికా చేపట్టలేదు. మాజీ మంత్రి ఆర్కేరోజా ఏపీఐఐసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడంతో సెజ్ ఏర్పాటుకు తొలి అడుగు పడింది. సెజ్ పనుల్లో పురుగతి లభించింది. భూసేకరణ వేగవంతమైంది. రైతులకు సముచిత పరిహారం అందించేందుకు చర్యలు తీసుకున్నారు. మొత్తం 2,042 ఎకరాల మేర భూమిని సేకరించి ఏపీఐఐసీకి అప్పగించారు. పలు కార్పొరేట్ సంస్థల యాజమాన్యాలతో ఏపీఐఐసీ ద్వారా సంప్రదింపులు చేశారు. ప్రాజెక్టు పనులు వేగంగా జరిగే తరుణంలో రాష్ట్రంలో ఎన్నికలు రావడం.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ పారిశ్రామికాభివృద్ధి పనులు అటకెక్కాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతున్నా ఎలాంటి ప్రగతీ కనిపించలేదు. దీంతో మళ్లీ వేల ఎకరాల భూములు నిరుపయోగంగా మారిపోయాయి.

గతంలో భూ సేకరణ వేగవంతం

విజయపురం మండలంలోని జగన్నాథపురం, మహావీరపురం, విజయపురం, కోశలనగరం, శ్రీహరిపురం, మహారాజపురం ప్రాంతాలన్నింటినీ కలిపేలా 5,810 ఎకరాల్లో సెజ్‌ను ఏర్పాటుచేసేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేశారు. 2,042 ఎకరాలు సేకరించి ఏపీఐఐసీకి కేటాయించారు. భూములు ఇచ్చిన వారికి ఎకరాకి రూ.7 లక్షల నుంచి రూ.9 లక్షల వరకు నష్టపరిహారం కూడా అందేలా చర్యలు చేపట్టారు. తమిళనాడు పరిశ్రమల కోసం కోసల నగరం నుంచి సమీప జాతీయ రహదారిని కలిపేందుకు రోడ్డు నిర్మాణానికి పూనుకున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం మారడం పరిశ్రమల పాలిట శాపంగా మారింది.

వేలాది మందికి ఉద్యోగాలు

అన్నీ సక్రమంగా జరిగి కోసలనగరం పారిశ్రామిక వాడ పూర్తయివుంటే పలు పరిశ్రమలు ఏర్పాటై ఉండేవి. సెజ్ ద్వారా కనీసం 10 వేల మందికి ఉపాధి లభించేది. పరిసర ప్రాంతాల్లోని నిరుద్యోగులతో పాటు జిల్లా వ్యాప్తంగా ఎందరికో ఉద్యోగాలు వచ్చి ఉండేవి.

మొదట్లో హడావుడి



2020లో ఏపీఐఐసీ పనులు వేగవంతం చేసింది. భూములు కోల్పోయే రైతులకు నష్టపరిహారం ఇవ్వడంతో పాటు అవసరమయ్యే భూములు సేకరించారు. ప్రస్తుతం పనులు ఏమాత్రం జరగడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో హడావిడి చేసింది. ఆపై చేతులు పైకెత్తేసింది. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్నత విద్యావంతులు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది ఉపాధి కోసం తమిళనాడుకు వెళ్లిపోతున్నారు. సెజ్ ప్రారంభమైతే యువతకు స్థానికంగా ఉపాధి లభిస్తుంది.

– కుమార్, సర్పంచ్, పన్నూరు


ఎక్కడి పనులు అక్కడే



విజయపురం మండలం చుట్టూ నగరి, పిచ్చాటూరు, నింద్ర మండలాలు ఉన్నాయి. పరిశ్రమలు వస్తే విజయపురం మండలం బాగా అభివృద్ధి చెందుతుంది. అలాగే భూముల రేటు కూడా పెరుగుతుంది. యువతీయువకులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ప్రస్తుతం ఉద్యోగం లేక చెన్నై వెళ్లిపోతున్నారు. కోసలనగరం సెజ్‌లో ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. భూములన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. పరిశ్రమలు వచ్చేలే చర్యలు తీసుకోవాలి.

– గోవర్ధన్‌నాయుడు, ఎంఅంగరం

పరిశ్రమలకు అత్యంత అనుకూలం


ఏపీఐఐసీ ముఖచిత్రం

తమిళనాడుకు సరిహద్దులో విజయపురం మండలం ఉంది. ఈ ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు అవసర మైన నీటి వనరులు పుష్కలంగా ఉన్నాయి. అలాగే వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నాయి. ఆధ్యాత్మిక నగరం తిరుపతికి ఈ ప్రాంతం 48 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. జిల్లా ప్రధాన కార్యాలయాలు 60 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నాయి. ఇదిగాక చెన్నై–తిరుత్తణి జాతీయ రహదారి 2.3 కిమీ దూరంలోనే ఉంది. చెన్నై పోర్టు 45 కి.మీ దూరంలో, కటికపల్లి ఓడరేవు 60 కి.మీ దూరంలో, కామరాజర్ ఓడరేవు 115 కి.మీ దూరంలోనే ఉన్నాయి. ఇక్కడి నుంచి రవాణాకు అనుకూలంగా ఉంటుంది. మరోవైపు చెన్నై విమానాశ్రయం 50 కిమీ దూరంలోను, రేణిగుంట విమానాశ్రయం 43 కిమీ. దూరంలో ఉండడంతో పరిపాలనాపరమైన వ్యవహారాలకు అనుకూలంగా ఉంటుంది. ఈ క్రమంలో ఇప్పటికే కోసలనగరం వద్ద కోరా ప్యాక్, చెన్నై పార్కింగ్ బ్రిక్స్ పరిశ్రమలను తమిళనాడు నుంచి వచ్చిన వారు ఏర్పాటుచేసుకున్నారు.

న్యూస్‌రీల్

నిజమైన కార్యకర్తలకు పెద్దపీట


ప్లకార్డులు చూపుతున్న భరత్, వైఎస్సార్‌సీపీ నేతలు

కుప్పం: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే కార్యకర్తలకు పెద్ద పీట వేస్తామని వైఎస్సార్‌సీపీ కుప్పం నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ భరత్ స్పష్టం చేశారు. సోమవారం బాబు షూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నన్ని రోజులు ఎందరో మాయమాటలు చెప్పారని, అధికారం కోల్పోగానే అడ్రస్ లేకుండా పోయారని చెప్పారు. అందర్నీ గుర్తుపెట్టుకుంటామని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే కార్యకర్తలకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు బాబు షూరిటీ –మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని గ్రామాల్లో నిర్వాహించాలని కార్యకర్తలకు సూచించారు. టీడీపీ నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తుచేయాలన్నారు. అనంతరం నూతనంగా వైఎస్సార్‌సీపీ నియమించినా మున్సిపల్ కమిటీని ఆయన సన్మానించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు హఫీజ్, మురుగేష్, మణి, మునిరాజ్, గుడుపల్లె జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, రామకృష్ణా, కుమారుస్వామి, మురుగేష్ పాల్గొన్నారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 45 ఫిర్యాదులు


సమస్యలు వింటున్న ఏఎస్పీ రాజశేఖర్‌రాజు

చిత్తూరు అర్బన్: నగరంలో నిర్వహించిన పోలీసు గ్రీవెన్స్‌కు 45 వినతులు అందాయి. చిత్తూరు నగరంలోని ఏఆర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, పోలీసు శిక్షణా కేంద్రం డీఎస్పీ రాంబాబు ప్రజల నుంచి వినతులు తీసుకున్నారు. వీటిలో కుటుంబ తగాదాలు, వేధింపులు, మోసాలు, ఇంటి తగాదాలు, భూ తగాదాలు, లావాదేవీలకు సంబంధించిన సమస్యలున్నాయి. ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్ చేయడంతో పాటు నిర్ణీత గడువులోపు పరిష్కారమయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పలు ఫిర్యాదులపై అప్పటికప్పుడే వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఆయా స్టేషన్ హౌస్ అధికారులతో మాట్లాడారు.

నివాసం లేని ఇంటికి రూ.28,438 విద్యుత్ బిల్లు


ఎవరూ లేని ఇంటికి రూ.28,438 వచ్చిన బిల్లు

కార్వేటినగరం: నిత్యం ఫ్యాన్లు, ఏసీలు, టీవీలు పోతున్న ఇళ్లకు రాని విద్యుత్ బిల్లు ఎవరూ కాపురం లేని ఇంటికి రావడంతో స్థానికులు విస్తుపోతున్నారు. పరిశ్రమా.. లేకా ఇల్లా? అన్న అనుమానంతో గ్రామస్తులు అవాక్కయ్యారు. వివరాలు.. కార్వేటినగరం మండల పరిధిలోని ఎగువరాజులకండ్రిగ గ్రామానికి చెందిన దామోదరరాజు, శాంతమ్మ దంపతులు వారి పిల్లలతో పాటు గత కొన్నేళ్లుగా ఉద్యోగ రీత్యా బెంగళూరులో స్థిపడ్డారు. అయితే ఎప్పుడో పండుగలు, శుభ కార్యాలకు మాత్రం స్వగ్రామం ఎగువరాజుల కండ్రిగకు వచ్చి ఒక్కరోజు ఉండి వెళ్లేవారు. అయినప్పటికీ విద్యుత్ బిల్లులు సమీప బంధువులు చెల్లిస్తుంటారు. గత నెలలో దామోదరరాజు ఇంటికి విద్యుత్ బిల్లు రూ.64 వచ్చింది. ఆగస్టులో అకస్మాత్తుగా రూ.28,438 బిల్లు రావడంతో ఇంటి యజమాని షాక్ అయ్యారు. ప్రభుత్వ ఆలసత్వం వల్లే విద్యుత్ బిల్లులు ఇలా వస్తున్నాయని పలువురు విమర్శిస్తున్నారు.

విశ్వబ్రాహ్మణులకు లోకేష్ క్షమాపణ చెప్పాలి


పవిత్ర

పలమనేరు: విశ్వబ్రాహ్మణులకు లోకేష్ క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విభాగం అధ్యక్షురాలు పవిత్ర డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ చేనేత దినోత్సవం సందర్భంగా లోకేష్ మంగళగిరిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పద్మశాలిలకు రెండు కులవృత్తులుంటాయని, అందులో ఒకటి చేనేత, రెండోది స్వర్ణకార వృత్తి అని చెప్పడం బాధాకరమన్నారు. కనీసం రాష్ట్రంలోని బీసీ కులాల్లో ఏకులం ఏ కులవృత్తిని చేస్తుందో తెలియక ఆయన తెలివిలేకుండా మాట్లాడడం శోచనీయమన్నారు. విశ్వబ్రాహ్మణుల మనోభావాలను దెబ్బతినేలా లోకేష్ మాట్లాడడం చాలా బాధ కలిగించిందని, దీన్ని తాను ఖండిస్తున్నానని పేర్కొన్నారు.

గంగమ్మా.. కూటమికి మంచి బుద్ధి ప్రసాదించమ్మా!

- మిథున్‌రెడ్డి విడుదల కావాలని బోయకొండలో పూజలు
- తరలివచ్చిన పార్టీ శ్రేణులు


చౌడేపల్లె : బోయకొండలోని నాలుగుకాళ్ల మండపం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చౌడేపల్లె: అక్రమ కేసులో అరెస్టయిన రాజంపేట ఎంపీ పీవీ.మిథున్‌రెడ్డి విడుదల కావాలని కోరుతూ బోయకొండలో సోమవారం 1,116 కొబ్బరికాయలు కొట్టి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దిగువపల్లె పంచాయతీకి చెందిన నేతలు మునికృష్ణమనాయుడు, కొలింపల్లె గంగిరెడ్డి, లడ్డూరమణ, నరసింహారెడ్డి, ఆనందరెడ్డి, వెంకటరెడ్డి, జీఆర్ఎస్ రమణ, ప్రసాద్‌నాయుడు, శ్రీనాథ్, సుధ, గంగిరెడ్డి, సోని ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మండలంలోని పార్టీ ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. బోయకొండలో నాలుగు కాళ్ల మండపం వద్ద నుంచి మెట్ల మార్గంలో బయలుదేరివెళ్లి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం పేరిట అభిషేకం, అర్చనలు చేశారు. కూటమి ప్రభుత్వం పెద్దిరెడ్డి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని ఇబ్బందులకు గురిచేస్తోందని, మంచి బుద్ధిని ప్రసాదించాలని పూజలు చేశారు. మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా అక్రమ కేసు నుంచి బయటకు వచ్చేలా శక్తిని ప్రసాదించాలని కోరారు. అనంతరం మండపం వద్ద కొబ్బరికాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నాగభూషణరెడ్డి, బోయకొండ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్‌నారాయణ, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, యువకాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు మిద్దింటి కిషోర్ బాబు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు వెంకటరమణ, మాజీ సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, సర్పంచుల సంఘ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు షంషీర్, చెంగారెడ్డి, ఓబులేసు, ప్రభాకర్ యాదవ్, ఓబుల్‌రెడ్డి, శ్రీరాములు, రమేష్ బాబు, మణిరాజు, అనుప్రియ, గిరిబాబు, శంకరప్ప, అరుణ, ఖాజా తదితరులు పాల్గొన్నారు.


చిత్తూరు: పోస్టర్లతో మద్దతు తెలుపుతున్న విజయానందరెడ్డి, నాయకులు

మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని పూజలు

చిత్తూరు కార్పొరేషన్: కక్షలే పాలనగా.. కేసులే పరమావధిగా రాష్ట్రంలో పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి విమర్శించారు. సోమవారం నగరంలోని దొడ్డిపల్లె సప్తకనికలమ్మ ఆలయంలో మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు చేశారు. ఆలయం వెలుపల టెంకాయలు కొట్టి రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని ప్రార్థించామన్నారు. ఉయ్ స్టాండ్ ఫర్ మిథున్‌రెడ్డి అంటూ పోస్టర్లు చేతబట్టి వారి మద్దతును తెలిపారు. విజయానందరెడ్డి మాట్లాడుతూ జగనన్నకు అప్తుడు అయిన మిథున్‌రెడ్డిపై కక్షగట్టి అక్రమంగా అరెస్టు చేశారన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డిని మానసికంగా వేధించాలనే ఇలాంటి కుట్రలు పన్నుతున్నారని తెలిపారు. అనంతరం డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, చుడా మాజీ చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాయత్రీదేవి, మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్, జెడ్పీటీసీ బాబునాయుడులు మాట్లాడారు. నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, నాయకులు మధుసూదన్, హరిషారెడ్డి, కృష్ణారెడ్డి, లత, బిందు, మనోహర్‌రెడ్డి, మధురెడ్డి, చల్లాముత్తు, శివ, అప్పాజీ, మనోజ్‌రెడ్డి, మదన్, త్యాగ, స్టాండ్లీ, గుణ, సత్య, గురుమూర్తి, రాంగణేష్, లోక, శివారెడ్డి, చంద్ర పాల్గొన్నారు.

మసెమ్మ ఆలయంలో పూజలు

పుంగనూరు: ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి విడుదల కావాలని కోరుతూ మసెమ్మ ఆలయంలో వైఎస్సార్‌సీపీ నేతలు 101 కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అమరనాథరెడ్డి, జిల్లా యూత్ వింగ్ కార్యదర్శి కొత్తపల్లె చెంగారెడ్డి, పీకేఎం మాజీ ఉడా చైర్మన్ వెంకటరెడ్డియాదవ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కలసి కొండచెర్ల కురప్పల్లెలో గల మసెమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీ మిథున్‌రెడ్డి ఎదుగుదలను చూసి ఓర్వలేక తప్పుడు కేసులు బనాయించి అరెస్ట్ చేసిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకరప్ప, ఎంపీటీసీ సభ్యుడు నంజుండప్ప, జిల్లా అధికార ప్రతినిధి రాజశేఖర్‌రెడ్డి, బోయకొండ మాజీ చైర్మన్ నాగరాజారెడ్డి, పార్టీ నాయకులు చంద్రారెడ్డి యాదవ్, సుబ్బన్న, జయరామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, సుబ్రమణ్యం, బాబునాయక్ పాల్గొన్నారు.


పుంగనూరు: కురప్పల్లెలోని మసెమ్మ ఆలయంలో కొబ్బరికాయలు కొడుతున్న భాస్కర్‌రెడ్డి, వెంకటరెడ్డి యాదవ్, చెంగారెడ్డి

అనుబంధ విభాగాలు చురుగ్గా పనిచేయాలి


వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులతో సమావేశమైన భూమన కరుణాకరరెడ్డి

- కూటమి అరాచకాలు, దాడులపై నిరసనలు చేయండి
- తిరుపతి, చిత్తూరు జిల్లాల వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు భూమన

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టడంలో వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నాయకులు చురుగ్గా పని చేయాలని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి సూచించారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన పార్టీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు, అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతున్నారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో కూటమి నాయకులు చేస్తున్న అరాచకాలు, దాడులపై పార్టీ జిల్లా అనుబంధ విభాగాల నాయకులు ఎప్పటికప్పుడు స్పందిస్తూ నిరసనలు చేపట్టాలన్నారు. కేసులకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని.. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడిగా తాను ఉద్యమాల్లో ముందుంటానని తెలిపారు. కూటమి అరాచకాలను, దాడులను ఎప్పటికప్పుడు సోషల్‌మీడియా ద్వారా ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల కూటమి నాయకులు ఎస్సీ, ఎస్టీ, బీసీలపై విపరీతంగా దాడులకు పాల్పడుతున్నారని, వాటిని ఆయా వర్గాల నాయకులు ఖండించాలన్నారు. సమావేశంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలపై పోరుబాట

- ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించడంలో నిర్లక్ష్యం
- కళాశాలలు ఎలా నిర్వహించుకోవాలని ఆవేదన
- ఇప్పటి వరకు ఒక్క విడత ఫీజు బకాయి చెల్లించలేదని ఆరోపణ
- ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ నాయకుల మండిపాటు


మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రరెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ఫీజు బకాయిల కోసం పోరాటం చేయాల్సిన దుస్థితి ఏర్పడుతోందని ఏపీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రరెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆ అసోసియేషన్ నాయకులు సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు చిల్లిగవ్వకూడా ఇవ్వలేదన్నారు. ఫీజు బకాయిలు ఇవ్వకపోతే కళాశాలలు ఎలా నిర్వహించాలని ప్రశ్నించారు. అప్పులు చేసి కళాశాలలు నిర్వహిస్తున్న తమ పరిస్థితి ఏమవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం 2023–24 సంవత్సరానికి 3 విడతల ఆర్టీఎఫ్, 2024–25 విద్యాసంవత్సరంలో 3 మొత్తం 6 విడతల ఆర్టీఎఫ్ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. తమ సమస్యను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మొరపెట్టుకుంటున్నామన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 3వ తేదీన విద్యాశాఖామంత్రి లోకేష్ దృష్టికి సైతం తీసుకెళ్లామన్నారు. అయినా ఏ మాత్రం స్పందన లేదన్నారు. బకాయిలు విడుదల కాకపోవడంతో సిబ్బంది జీతాలు, రవాణా, కళాశాల నిర్వహణ కష్టతరమవుతోందన్నారు. చాలామంది కరస్పాండెంట్లు అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో పోరాటానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి ఈనెల 13న తాడేపల్లిలోని రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఈ ధర్నాకు జిల్లాలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల నిర్వాహకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆ అసోసియేషన్ నాయకులు బాలాజీ, వాసు, ప్రభు, సురేష్, జానకిరామిరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంట్లో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

గంగవరం: ఇంట్లో ఉరేసుకుని గంగవరం సమీపంలోని జనని మెస్ నిర్వాహకుడు కుమార్(48) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. మండల పరిధిలోని సాయినగర్‌లో నివాసముంటున్న కుమార్ కొన్నేళ్లుగా అక్కడే జననీ మెస్ నిర్వహిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. అయితే అతని ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం షాపునకు కన్నం వేసి చోరీ


మద్యం షాపులో చోరీకి పాల్పడుతున్న దొంగ

రొంపిచెర్ల: రొంపిచెర్ల మండల కేంద్రంలోని ఓ ప్రయివేటు మద్యం దుకాణంలో నగదు, మద్యం చోరీకి గురైనట్లు రొంపిచెర్ల పోలీసులకు ఫిర్యాదు అందింది. సూపర్‌వైజర్ వెంకటసాయి కథనం.. ఫజులుపేట సమీపంలో ఉన్న ఎస్వీ మద్యం షాపులో ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు గోడకు రంధ్రం వేసి లోనికి చొరబడ్డారు. మద్యం షాపులో ఉన్న లాకర్ ఉంచిన రూ.1.88 లక్షల నగదు, అలాగే రూ.9వేల విలువ చేసే మూడు మద్యం బాటిళ్లను చోరీ చేశారు. రొంపిచెర్ల ఎస్ఐ సుబ్బారెడ్డి ఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

సీపీఐ జిల్లా కార్యదర్శిగా నాగరాజు


నాగరాజు, జనార్ధన్, శివారెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: సీపీఐ జిల్లా కార్యదర్శిగా రెండో పసారి ఎస్.నాగరాజును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ మేరకు పార్టీ నాయకులు సోమవారం వివరాలను ప్రకటించారు. ఆగస్టు 9, 10 తేదీల్లో నగరిలో జరిగిన జిల్లా 24వ మహాసభలో పలు పోస్టులకు సంబంధించి ప్రతిపాదనలు పెట్టగా వాటిని రాష్ట్ర కార్యవర్గం ఆమోదించిందన్నారు. ఆయనతో పాటు జిల్లా సహాయ కార్యదర్శులుగా టీ. జనార్ధన్, ఎస్.శివారెడ్డిని ఎన్నుకున్నరన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు వివరించారు.

ఆలయ భూములపై.. భస్మాసురహస్తం!


చిత్తూరు ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద ఉన్న అత్యంత విలువైన దేవదాయశాఖ భూములు

- దేవుడి మాన్యాలు 'పచ్చ' నేతల చేతుల్లోకి
- చిత్తూరులో రూ.50 కోట్ల విలువైన భూమి అన్యాక్రాంతం
- నామమాత్రపు అద్దెలు.. మూడేళ్ల లీజు పేరిట నాటకం
- ఆపై 99 ఏళ్ల పాటు లీజుకు తీసుకునేలా ఒప్పందం?
- టెండరు నోటీసులు ఇవ్వకుండా అధికారుల డ్రామా
- కరపత్రాలతో పబ్లిసిటీ ఇచ్చినట్లు రికార్డుల్లో రాసేసిన వైనం

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిత్తూరు నగరంలోని కొందరు కూటమి పార్టీ ప్రజాప్రజాప్రతినిధుల కన్ను ఆలయ భూములపై పడింది. ఐదేళ్ల పాటు నిధుల ఆకలితో అల్లాడిపోయిన నేతలు ఏకంగా దేవుడికే శఠగోపం పెట్టేశారు. టెండరు లేదు.. నోటీసు బోర్డులో కరపత్రాలు పెట్టలేదు.. పోటీలేదు.. కానీ వేలం పాట మాత్రం జరిగిపోయినట్లు రికార్డులు సృష్టించేశారు. దాదాపు రూ.50 కోట్ల విలువైన దేవదాయశాఖ భూముల్ని లీజు పేరిట కారుచౌకగా కొట్టేశారు.

అన్ని వేళ్లూ అధికారుల వైపే

ఈ మొత్తం వ్యవహారంలో దేవదాయశాఖకు చెందిన కొందరు అధికారులు కూటమి నేతలు చెప్పినట్లు తలూపినట్లు స్పష్టమవుతోంది. దేవదాయశాఖకు చెందిన ఏ స్థలాన్ని లీజుకు ఇవ్వాలన్నా ముందుగా పత్రికా ప్రకటన ఇవ్వాలి. ఆపై బహిరంగ వేలం పాట నిర్వహించాలి. ఈ సమయంలో శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడకుండా భద్రత కోరుతూ డీఎస్పీకి లేఖ రాయాలి. వేలం పాటకు ఒకే వ్యక్తి వచ్చినట్లయితే వాయిదా వేయాలి. వేలం పాట జరిగే ప్రక్రియ మొత్తాన్ని వీడియో రికార్డు చేయించాలి. కానీ అధికారులు ఎవ్వరూ కూడా ఈ నిబంధనలు పాటించలేదు. గుట్టుచప్పుడు కాకుండా కూటమి నేతలకు ఆలయ భూములు అప్పగించేశారు. తొలుత మూడేళ్ల పాటు లీజుకు తీసుకుని.. 99 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చే ఒప్పందం కుదుర్చుకోవచ్చన్న దురాలోచన కూడా అధికారులే సూచించినట్లు సమాచారం. చేసిన తప్పును సరిదిద్దుకోవడానికి అధికారులు కరపత్రాలు ముద్రించి, వీటిని నగరంలోని ఇంటింటికీ పంచిపెట్టినట్లు తప్పుడు రాతలను పుస్తకాల్లోకి ఎక్కించారు. ఆలయ భూములను చెరబట్టిన కూటమి నేతల చేష్టలపై సొంత పార్టీ నాయకులే సామాజిక మాధ్యమాల్లో దుమ్మెత్తి పోస్తుండడం కొసమెరుపు.

ఎవడ్రా ఆపేది?

- చిత్తూరు నగరంలోని జీవకారుణ్యసత్రానికి సంబంధించిన 3.3 ఎకరాల విస్తీర్ణంలో భూములున్నాయి. ఓవర్ బ్రిడ్జి కింద, రైల్వేస్టేషన్–బస్టాండుకు పక్కనే ఉన్న ఈ భూమి విలువ రూ.30 కోట్లకు పైమాటే. ఇంతటి విలువైన స్థలాన్ని నెలకు రూ.75 వేల నామమాత్రపు అద్దెకు అధికారులు లీజుకు ఇచ్చేశారు. త్వరలోనే ఇక్కడ వాణిజ్య సముదాయం, కాంప్లెక్స్ నిర్మించనున్నట్లు తెలుస్తోంది. ఇక్కడున్న పురాతనమైన ఈశ్వరుని ఆలయం ఎదుట భక్తుల సౌకర్యార్థం రేకుల షెడ్డు వేసుకోవాలంటే భక్తులకు అనుమతి ఇవ్వని దేవదాయశాఖ అధికారులు.. అసలు టెండరు ఇవ్వకుండా రూ.కోట్ల విలువచేసే స్థలంలో కాంప్లెక్సులు కట్టడానికి పర్మిషన్ ఎలా ఇచ్చారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.
- చిత్తూరు పొన్నియమ్మ గుడి వీధిలోని వీరాంజనేయస్వామి దేవాస్థానానికి సంబంధించి ఆర్టీసీ డిపో సమీపంలో 17 సెంట్ల భూమిని నెలకు రూ.49,700 చొప్పున అద్దెకు తీసుకున్నట్లు గత ఏడాది రికార్డుల్లో నమోదైంది. ఈ స్థలంలో షాపులు కూడా నిర్మించేశారు. ఈ షాపుల ద్వారా నెలవారీ అద్దె రూ.లక్షకు పైనే వస్తుంది. అడ్వాన్సుల కింద రూ.10 లక్షల వరకు ఆదాయం వచ్చినట్లు సమాచారం. అన్యాక్రాంతంగా ఉన్న భూమి నుంచి అద్దెలు వసూలు చేస్తే తప్పేంటనేది అధికారుల ప్రశ్న.
- చిత్తూరు నగరం హైరోడ్డు ప్రాంతంలో వడ్లమండి సత్రం ఉంది. సత్రం భూమిలో మొత్తం 18 దుకాణాలు ఉండేవి. నెలకు రూ.1.15 లక్షలు ఆదాయం వచ్చేవాటిని రోడ్డు విస్తరణ పేరిట కార్పొరేషన్ అధికారులు కూల్చేశారు. రూ.15 కోట్ల విలువ చేసే ఖాళీ స్థలంలో పర్యాటక రంగం పేరిట అభివృద్ధి చేయడానికి భూమిని లీజుకు తీసుకునేందుకు పూతలపట్టుకు చెందిన కూటమి నేత ప్రధాన అనుచరుడు దరఖాస్తు పెట్టుకున్నాడు. బంగారుపాళ్యంకు చెందిన ఆ పచ్చ చేత కన్ను పడ్డ దేవదాయశాఖ స్థలాన్ని విడిపించడం ఎవ్వరితరం కాదనే వాదన వినిపిస్తోంది.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

యాదమరి: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. డీఎస్పీ సాయినాథ్ కథనం మేరకు.. యాదమరి మండలం, బోదగుట్టపల్లి పంచాయతీ, తొట్టిగాని ఇండ్లుకు చెందిన సదాశివం కుమారుడు విజయకుమార్(26) తమిళనాడు రాష్ట్రం పరదరామిలో ఆవుల వ్యాపారం చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. ఆదివారం స్వగ్రామానికి వచ్చాడు. సాయంత్రం స్నేహితులను కలిసి వస్తానని చెప్పి వెళ్లాడు. ఆపై ఎంతకూ రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. సోమవారం మృతుని తండ్రి సదాశివం కనికాపురం చెరువు వద్ద ఉన్న తన పొలం గట్టుకు వెళ్లాడు. అక్కడ విజయకుమార్ చెట్టుకు ఉరి వేసుకుని కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ సాయినాథ్, తవణంపల్లి ఎస్ఐ చిరంజీవి సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకుని రక్తపు మడుగులో ఉన్న మృతదేహాన్ని పరిశీలించారు. ప్రాథమిక విచారణలో హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించినట్లు అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఐదో రోజూ ఆగని ఏనుగుల దాడులు


రెడ్డిగారిపల్లె వద్ద ఏనుగులు తొక్కేసిన వేరుశనగ పంట

పులిచెర్ల(కల్లూరు): మండలంలో గత ఐదు రోజులుగా పంట పొలాలపై ఏనుగుల దాడులు ఆగనంటున్నాయి. సోమవారం మండలంలోని గండ్రోలపల్లె, బాలిరెడ్డిగారిపల్లె, దేశిరెడ్డిగారిపల్లెల్లోని పొలాలపై పడి వేరుశనగ, మామిడి, కొబ్బరి చెట్లు, వరి మడులను నాశనం చేశాయి.

డీఎస్సీ ఫలితాలు వచ్చేశాయ్

- కేటగిరీల వారీగా ఫలితాల వెల్లడి
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 50,502 మంది అభ్యర్థుల ఫలితాలు
- త్వరలో టెట్ అభ్యంతరాల ప్రక్రి
- ఆపై ర్యాంకులు, అర్హుల వివరాలు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది జూన్ 6 నుంచి జూలై 3వ తేదీ వరకు మెగా డీఎస్సీ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షా ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాత్రి విడుదల చేసింది. చిత్తూరు జిల్లా పరిధిలో 33,181 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం పెట్టిన మెలికల కారణంగా చాలామంది పరీక్షలు రాయలేక నష్టపోయారు. జిల్లా వ్యాప్తంగా 33,181 మంది దరఖాస్తు చేసుకోగా 30,952 మంది పరీక్షకు హాజరయ్యారు. అదేవిధంగా తిరుపతి జిల్లాలో 21,340 మంది దరఖాస్తు చేసుకోగా.. 19,550 మంది పరీక్షలు రాశారు.

ఫలితాలు ఇలా..

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పరీక్షలకు హాజరైన 50,502 మంది అభ్యర్థుల డీఎస్సీ ఫలితాలను ప్రకటించారు. ఆయా అభ్యర్థుల వ్యక్తిగత వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఫలితాలు పొందేలా అవకాశం కల్పించారు. టెట్ వెయిటేజీ, డీఎస్సీ మార్కుల స్కోర్లను కలిపి మొత్తం స్కోర్‌ను ప్రకటించారు. ప్రస్తుతం ఫైనల్ స్కోర్ మాత్రమే ప్రకటించారు. కొందరు టెట్ మార్కులు తప్పుగా నమోదు చేయడంతో వాటిని ఎడిట్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఆ ప్రక్రియ ముగిసిన తర్వాత తుది ఎంపిక జాబితాను ప్రకటిస్తారని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. తుది ఎంపిక జాబితా అనంతరం ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని 1,478 పోస్టులను భర్తీ చేయనున్నారు.



డీఎస్సీ ఫలితాలు ప్రచురించిన వెబ్‌సైట్ చిత్రం


పేరు : ఎం.ప్రశాంత్
ప్రాంతం : చిత్తూరు నగరం
పోస్టు : ఎస్జీటీ
మొత్తం స్కోర్ :
100 మార్కులకు 82.48


పేరు : ఎస్.భార్గవ
ప్రాంతం : ఐరాల.
పోస్టు : ఎస్జీటీ
మొత్తం స్కోర్ :
100 మార్కులకు 80.08


పేరు : ఎస్. రమేష్
ప్రాంతం : కుప్పం
పోస్టు : ఎస్జీటీ
మొత్తం స్కోర్ :
100 మార్కులకు 86.36


పేరు : కే.మునికుమార్
ప్రాంతం : పలమనేరు
పోస్టు : ఎస్జీటీ
మొత్తం స్కోర్ :
100 మార్కులు 71.20

గుర్తుతెలియని వాహనం ఢీకొని కానిస్టేబుల్ మృతి

- నివాళి అర్పించిన ఎస్పీ, డీఎస్పీలు


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అయ్యప్ప (ఫైల్)

కార్వేటినగరం: గుర్తుతెలియని వాహనం ఢీకొని కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన మండలంలోని కుప్పానిగుంట సమీపంలో చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. కార్వేటినగరం బీసీ కాలనీకి చెందిన అయ్యప్ప(41) పుత్తూరు ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఓ కేసు విచారణ కోసం పళ్లిపట్టుకు వెళ్తూ మార్గమధ్యంలోని సురేంద్రనగరం సమీపం, చిన్నకనుమ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి తల్లిదండ్రులతో పాటు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అయ్యప్ప మృతదేహానికి ఘన నివాళి

మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ అయ్యప్ప మృతదేహానికి తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఘన నివాళి అర్పించారు. అలాగే పుత్తూరు డీఎస్పీ రవికుమార్, నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్, స్థానిక సీఐ హనుమంతప్ప పూలమాల వేసి నివాళి అర్పించారు.


అయ్యప్ప మృతదేహానికి నివాళి అర్పిస్తున్న తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ అయ్యప్ప కుటుంబానికి తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వ పరంగా కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటానని వారికి భరోసా ఇచ్చారు. అదే విధంగా ఏఆర్ కానిస్టేబుల్ యూనియన్ ఆధ్వర్యంలో అయ్యప్ప కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు.

పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు

ఏఆర్ కానిస్టేబుల్‌గా పుత్తూరులో విధులు నిర్వహిస్తున్న అయ్యప్ప మృతి చెందడంతో సోమవారం తన స్వగ్రామం కార్వేటినగరంలో పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.


జాతీయ స్థాయి రగ్బీలో ప్రతిభ


నర్రా అక్షయ


టోర్నీలో మూడోస్థానంలో నిలిచిన ఇండియా జట్టులో అక్షయ

పలమనేరు: జాతీయ స్థాయి రగ్బీలో పలమనేరు పట్టణానికి చెందిన అక్షయ ప్రతిభ చాటింది. ఆసియా రగ్బీ ఎమిరేట్స్ అండర్–20 చాంపియన్‌షిప్ 2025లో ఇండియా మూడో స్థానంలో నిలవడంలో విశేష ప్రతిభ కనబరిచింది. రెండు రోజుల క్రితం బీహార్‌లోని రాజ్‌గిరి ఇంటర్నేషనల్స్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన సెమీస్‌లో మన జట్టు చైనా చేతిలో ఓడింది. దీంతో కాంస్య పతకం దేశానికి దక్కింది. ఈ జట్టులో పలమనేరుకు చెందిన అక్షయ ఉంది. భవిష్యత్తులో అక్షయ ఇండియన్ మహిళా జట్టులో కీలకం కానుంది. అక్షయ తల్లిదండ్రులైన నర్రా సురేష్, శ్రీదేవీ పట్టుదలతోనే ఆమె జాతీయ స్థాయికి ఎదిగిందని తెలుస్తోంది. ఆమెకు అభినందనల వెల్లువెత్తుతున్నాయి.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి


చిత్తూరు నగరంలో నిర్వహించిన తిరంగా ర్యాలీ (ఇన్‌సెట్) రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీచేసి సత్తాచాటాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం చిత్తూరు జిల్లా కేంద్రంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు కష్టపడి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. అంతకుముందు మాజీ జిల్లా అధ్యక్షుడు నారాయణస్వామినాయుడు, జోనల్ ఇన్‌చార్జి శివనారాయణ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోతే బాబు పాలన సాగించలేరన్నారు.

చిత్తూరులో చాయ్ పే చర్చ

ఉదయం చాయ్ పే చర్చ కార్యక్రమంలో భాగంగా నగరంలోని మిట్టూరులో ఓ టీ దుకాణంలో రైతులు, ప్రజలతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ముచ్చటించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, స్థానిక సమస్యలను ఆయనకు ఏకరువు పెట్టారు. అనంతరం కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహానికి, వివేకానంద విగ్రహానికి నివాళులర్పించి తిరంగా ర్యాలీలో పాల్గొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వనాయుడు, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, మాజీ ఎంపీ దుర్గారామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరచౌదరి, నాయకులు నిషిద, చిట్టిబాబు, రామభద్ర, షణ్ముగం, సత్య పాల్గొన్నారు.

నిరక్షరాస్యులకు వరం ఓపెన్ స్కూల్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఓపెన్ స్కూల్ విధానాన్ని నెలకొల్పారని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ తెలిపారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులతో ఓపెన్ స్కూల్ అడ్మిషన్‌ల ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు పక్కాగా అమలు చేయాలన్నారు. చదువు మధ్యలో మానేసిన, బడికి వెళ్లే పరిస్థితి లేని వారికి సార్వత్రిక (ఓపెన్ స్కూల్) విధానం ఎంతో సులభమైందన్నారు. డీఈవో వరలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఏటా ఈ విధానంలో పది, ఇంటర్ కోర్సులకు అడ్మిషన్‌లు చేస్తున్నట్టు తెలిపారు. ఆగస్టు 31, 2025 నాటికి 15 సంవత్సరాలు నిండిన అభ్యర్థులు అడ్మిషన్‌లు పొందవచ్చన్నారు. అభ్యర్థులకు ఏప్రిల్, మే, జూలై నెలల్లో పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తారని, ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించే అభ్యర్థులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందేందుకు అర్హత ఉంటుందన్నారు. పదో తరగతికి రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100, అడ్మిషన్ ఫీజు జనరల్ కేటగిరీకి రూ.1,300, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతరులకు రూ.900 చెల్లించాలన్నారు. ఇంటర్మీడియెట్‌కు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200, అడ్మిషన్ ఫీజు జనరల్ కేటగిరీకి రూ.1,400, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతరులకు రూ.1,100 చెల్లించాలన్నారు. అనంతరం అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ నరేంద్రపడాల్, జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, డ్వామా పీడీ రవికుమార్, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ, డీఈవో కార్యాలయం ఏడీ–2 వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

ఆకాశంలో మూడో కన్ను

అన్నింటా ఇపుడు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) పరిజ్ఞానం వచ్చేసింది. విద్య, వైద్యం, ఆఖరుకు హెయిర్‌కట్ చేసే దుకాణాల్లో సైతం వ్యక్తి ముఖాకృతికి తగ్గట్టు హెయిర్ స్టయిల్‌ను సూచించే కంప్యూటర్లు ఉన్నాయి. ఈ క్రమంలోనేన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని దొంగలను పట్టుకోవడం.. అసలు దొంగతనాలే జరగకుండా ఉండడానికి పోలీసుశాఖ అడుగులు వేస్తోంది. ఏఐకు డ్రోన్లు జోడించి నిఘా ఉంచడానికి జిల్లా పోలీసు యంత్రాంగం సిద్ధమవుతోంది.

- ఖాకీ యూనిఫామ్ ధరించనున్న డ్రోన్లు
- పోలీసుశాఖలో సాంకేతిక పరిజ్ఞానంతో నిఘా
- ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకున్న పోలీసు సిబ్బంది
- జిల్లాకు 41 డ్రోన్లు అవసరమని నివేదించిన ఎస్పీ
- నేర నియంత్రణ.. అసాంఘిక శక్తుల గుర్తింపే లక్ష్యం

చిత్తూరు అర్బన్: పోలీసు శాఖకు డ్రోన్ల అవసరం కచ్చితంగా ఉంది. ఎవరైనా దొంగ చైన్‌స్నాచింగ్ చేసి పారిపోతుంటే అతని వెంట పరుగెత్తే రోజులు పాతకాలంవి. ఇప్పుడు కూర్చున్నచోటు నుంచే సెల్‌ఫోన్‌లో చూస్తూ దొంగను పట్టుకోవచ్చు. దీనికి డ్రోన్ సాయం చేస్తుంది. కాలంతో పోటీపడుతూ నేరం చేసే నిందితులు సరికొత్త మార్గాల్లో దొంగతనాలు, దోపిడీలు చేస్తూ పోలీసులకు సవాళ్లు విసురుతున్నారు. ఈ సవాళ్లను దీటుగా ఎదుర్కొనేందుకు పోలీసుశాఖ కూడా జవాబునిచ్చేందుకు సిద్ధపడుతోంది. రోడ్లపై పోలీసులు కనిపిస్తే తప్పు చేసే వాళ్లు కాస్త ఆలోచిస్తారని నిత్యం గస్తీలు నిర్వహిస్తుంటారు. దీంతో పాటు నగరాలు, పల్లెటూర్లలో శివారు ప్రాంతాలు, కొండలు–గుట్టల్లో పేకాట ఆడటం, గంజాయి సేవించడం, అడవుల్లో నాటు సారా తయారు చేయడం లాంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపడానికి డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. చిత్తూరు జిల్లాలోని పలమనేరు, నగరి, కుప్పం, చిత్తూరు సబ్–డివిజన్లలో ఇప్పటికే పోలీసులు డ్రోన్లను నిఘా కోసం ఉపయోగిస్తున్నారు.


చిత్తూరులో డ్రోన్ ఉపయోగంపై శిక్షణను పర్యవేక్షిస్తున్న ఎస్పీ మణికంఠ (ఫైల్)

ప్రతీ స్టేషన్‌కు ఓ డ్రోన్

జిల్లాలోని నాలుగు సబ్–డివిజన్లలో ఉన్న నాలుగు డ్రోన్లు అన్ని స్టేషన్ల అవసరాలను వినియోగించడం పోలీసులకు కష్టంగా మారింది. దీంతో జిల్లాలోని ప్రతీ స్టేషన్‌కు డ్రోన్లు ఇవ్వడానికి రాష్ట్ర హోంశాఖ ఇప్పటికే పోలీసుశాఖ నుంచి వివరాలు తీసుకుంది. జిల్లాలోని 38 పోలీస్ స్టేషన్లతో పాటు అదనంగా మరో మూడు డ్రోన్లు కావాలని జిల్లా పోలీసుశాఖ నుంచి ప్రభుత్వానికి నివేదిక అందింది. స్టేషన్‌కు ఓ డ్రోన్ వస్తే శాంతి భద్రతల పర్యవేక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, అసాంఘిక శక్తుల ఆట కట్టించడానికి ఎంతో ఉపయోగపడుతుందని పోలీసులు భావిస్తున్నారు.


చిత్తూరులో డ్రోన్ ద్వారా ట్రాఫిక్ పరిస్థితి అంచనా వేస్తున్న పోలీసులు

శిక్షణ పూర్తిచేసుకున్న ఖాకీలు

డ్రోన్లను ఉపయోగించడానికి చిత్తూరు పోలీసుశాఖ నుంచి ఇటీవల సిబ్బందికి శిక్షణ కూడా పూర్తయ్యింది. మొత్తం 42 మందికి డ్రోన్లను వినియోగించే పద్ధతులపై చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో శిక్షణ ఇచ్చారు. ప్రతీ స్టేషన్ నుంచి ఓ కానిస్టేబుల్‌ను పిలిపించి శిక్షణ ఇప్పించారు.

డ్రోన్ల ద్వారా క్రైమ్ తగ్గిస్తున్నాం



జిల్లాలో ప్రస్తుతానికి ప్రతీ సబ్–డివిజన్‌కు ఓ డ్రోన్ ఉంది. రొటేషన్ పద్ధతిలో స్టేషన్లకు వీటిని ఉపయోగిస్తున్నాం. ప్రతీ స్టేషన్‌కు డ్రోన్ ఇవ్వడానికి ప్రతిపాదనలు వెళ్లాయి. సిబ్బందికి ఇప్పటికే శిక్షణ కూడా ఇప్పించాం. డ్రోన్ల ద్వారా నిఘా ఉంచడం వల్ల నేరం జరిగినపుడు నిందితుడ్ని పట్టుకోవడంతో పాటు.. అసలు నేరం జరగకుండా కూడా నియంత్రిస్తున్నాం. దీనివల్ల క్రైమ్ తగ్గుతోంది. – సాయినాథ్, డీఎస్పీ, చిత్తూరు